## స్వీట్లు పంచి సీట్లు కొట్టేస్తారు..

- ఇక బ్యాగులు పట్టుకుని తిరగాల్సిందే..
- యువ ఎమ్మెల్యేతో మంత్రి డీకే అరుణ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : స్వీట్లు పంచి సీట్లు లాక్కొంటారని పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి ఎమ్మెల్యే ఎం.రాజేష్‌కుమార్ రాష్ట్ర మంత్రి డి.కె.అరుణతో అన్నారు. మంగళవారం అసెంబ్లీలో సీఎం ఛాంబర్ వద్ద మంత్రి అరుణ, మీడియా ప్రతినిధుల మధ్య మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఆసక్తికర చర్చ జరిగింది. ఈ సమయంలో యువ ఎమ్మెల్యే రాజేష్‌కుమార్ అక్కడికి రాగానే ఏ రాజేష్ స్వీట్లు పంచిపెట్టావా? అని అడిగారు.

సోమవారం రాజ్యసభలో మహిళా బిల్లు ఆమోదం పొందకపోవడంతో తనకు రాత్రంతా నిద్రపట్టలేదని, భోజనం కూడా చేయలేదని, నీళ్లు కూడా ముట్టుకోలేదని రాజేష్ జోక్ వేశారు. ఇక ఇప్పుడు బ్యాగ్‌లు పట్టుకోవాల్సిందేనని మంత్రి అరుణ అనే సరికి, అవునండీ మీరేమో స్వీట్లు పంచి సీట్లు కొట్టేస్తారు, ఆ తరువాత మేము బ్యాగులు పట్టుకుని మీ వెంట తిరగాల్సిందేనని రాజేష్ కుమార్ చమత్కరించారు.

బీటీ కాటన్ విత్తనాల ధర పెంచే ప్రసక్తే లేదని, ధర పెంచేందుకు తాము అనుమతివ్వ బోమని ముఖ్యమంత్రి రోశయ్య మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబులకు స్పష్టం చేశారు. బీటీ కాటన్ విత్తనాల ధర పెంపు కోసం ప్రభుత్వ అనుమతి కోరుతూ నేషనల్ సీడ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఎంకు వినతి పత్రం సమర్పించడం, కొన్ని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిన నేపథ్యంలో మంత్రులు మంగళవారం సీఎంను కలిసారు. కాటన్ విత్తనాల ధరలు పెంచవద్దని, ధరలు పెంచడం వల్ల రైతులు నష్టపోతారని విజ్ఞప్తి చేశారు. నేషనల్ సీడ్స్ అసోసియేషన్ నుంచి వినతి పత్రం వచ్చిన మాట వాస్తవమేనని, అయితే కాటన్ విత్తనాల ధరలు పెంచేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతివ్వబోమని సీఎం స్పష్టం చేశారు.



## స్పందనలు

న్యూఢిల్లీ: 'ఇది గొప్ప చరిత్రాత్మకమైన రోజు' అని సీనియర్ నాయకులు అన్నారు. ఎంతో కాలం నుంచి అనేక తర్జనభర్జనలకు గురైన మహిళాబిల్లు మంగళవారం రాజ్యసభ ఆమోదం పొందడంతో నాయకులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్య ఇది. ఇప్పటికి ఎలాగో గట్టెక్కినా, లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఏమవుతుందనే ఆందోళన కూడా వారిలో ఉంది. సోమవారం రాజ్యసభలో కొందరు సభ్యులు ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీపై చేసిన దాడిని నాయకులందరూ ఏకగ్రీవంగా ఖండించారు.'అలా జరగడం దురదృష్టకరం, జరగకుండా ఉండాల్సింది' అన్నారు. బిల్లు రాజ్యసభ ఆమోదం పొందిన తర్వాత పాలకులు, నాయకులు తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ఆ అభిప్రాయాలు వారి మాటల్లోనే...

### ప్రభుత్వం పెద్ద సాహసం చేసింది



మహిళలకు సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద సాహసం చేయాలనే నిర్ణయించుకుంది. ఇలాంటి సాహసాలను గతంలో కూడా చేశాం. రాజకీయాలంటేనే రిస్క్‌తో కూడుకున్నవి. టీవీలో రాజ్యసభ కార్యలాపాలను చూస్తున్నప్పుడు చాలా ఉద్వేగానికి లోనయ్యాను. బిల్లుపై ఎదురయ్యే అనుకూలతను, ప్రతికూలతను బేరీజు వేసిన ప్రభుత్వం బిల్లుకు అండగా నిలవాలనే భావించింది. మంచి-చెడు ప్రభావాలున్నప్పటికీ, మహిళలకు సాధికారతనే ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుంది. బిల్లును సమర్థించిన భారతీయ జనతాపార్టీ, వామపక్షాలు, సంకీర్ణ కూటమిలోని భాగస్వామ్యపక్షాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. బిల్లును సమర్థించనివారు తర్వాత బాధపడతారు.

– సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు

### చరిత్రాత్మక సంఘటన



ఇది చరిత్రాత్మక సంఘటన. బిల్లు ఆమోదం పొందడాన్ని స్వాగతిస్తున్నాను. రాజ్యసభలో ఈ బిల్లు దాదాపు ఏకగ్రీవంగానే ఆమోదం పొందిందనవచ్చు.ఇది గొప్ప రోజు.చివరికి అంతా సవ్యంగానే జరుగుతుందనుకుంటున్నాను. రాజ్యసభలో ఒక అసమ్మతి గళం వినిపించింది. లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టినప్పుడు కూడా ఇదే సహకారం లభిస్తుందని ఆశిస్తున్నాను. సమాజ్‌వాది, ఆర్‌జెడి ఓటింగ్‌లో పాల్గొని తమ అభిప్రాయాన్ని తెలిపి ఉంటే బాగుండేది. సభా నిర్వహణ బాగుంది.

–పి. చిదంబరం, కేంద్ర హోంమంత్రి

### దాడి దురదృష్టకరం



ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీపై సోమవారం రాజ్యసభలో దాడి జరగడం దురదృష్టకరం. జరిగిందేదో జరిగింది. జరగాల్సిన దాని గురించి ఆలోచించాలి.

– వీరప్పమొయిలీ, న్యాయశాఖామంత్రి



### మెరుగైన వ్యూహం అవసరం

చర్చ సమయంలో సభ సజావుగా సాగేందుకు ప్రభుత్వం మెరుగైన వ్యూహాన్ని అనుసరిస్తుందని ఆశించాను. ఏదేమైనా ఈ సమావేశాల్లోనే బిల్లు ఆమోదం పొందేలా చూడాలి. ఈ బిల్లు ఆమోదానికి ఇప్పుడు సమయం వచ్చింది. ఈ తరుణంలో మమతా బెనర్జీ పార్టీ ఓటింగ్‌కు దూరంగాఉండాలనుకోవడం తప్పు. సంకుచిత రాజకయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన సమయం ఇది.

– బృందాకారత్, సిపిఎం నాయకురాలు

### ప్రజాస్వామ్య చరిత్రలో మైలురాయి



బిల్లు ఆమోదం పొందినందుకు హర్షిస్తున్నాను. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది మైలురాయి. ముస్లింల సమస్యల్ని పరిగణిస్తారని భావిస్తున్నాను. చివరికేమవుతుందో చూడాలి. కొందరు రాజ్యసభ సభ్యుల అరాచక ప్రవర్తనకు బాధపడుతున్నాను.

–ఫారూక్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు.

### సామాజిక న్యాయానికి తూట్లు



బిల్లు ఆమోదం హర్షణీయమే అయినా, బీసీలు, మైనారిటీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి తూట్లు పొడిచింది. ఇది అత్యంత బాధాకరం. బిల్లుకు సవరణ తెస్తుందని ఆశించాం. కానీ, అలా చేయకుండా బీసీలకు జనాభా లెక్కలే లేవని చెప్పడం కుంటిసాకు మాత్రమేమహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదు.ముందుగా ఎవరితోనూ సంప్రదించకపోవడంతో రాజ్యసభలో గందరగోళానికి దారితీసింది. దీనికి కాంగ్రెస్ పార్టీనే బాధ్యత. ఏడుగురు ఎంపీలను బహిష్కరించిన ఘనత కూడా ఆ పార్టీదే.

–ఎర్రన్నాయుడు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

### వాగ్దానం నెరవేరింది



బిల్లుపై వ్యతిరేకతతో, అసంతృప్తితో ఉన్న వారిని బుజ్జగించి, ప్రభుత్వం లోక్‌సభలో కూడా బిల్లు ఆమోదం పొందేలా చూస్తుందని ఆశిస్తున్నాను. భారత మహిళకు ఇచ్చిన వాగ్దానం నెరవేరినందుకు ఆనందిస్తున్నాను.

–జయంతి నటరాజన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి

### 50శాతం జనాభాకు మేలు



ఈ బిల్లు దేశ జనాభాలో 50 శాతం పైగా జనాభాకు మేలు చేస్తుంది. ఇందులో వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేదు. మమతబెనర్జీ మనసులో మరేదో ఉన్నట్టుంది. అందుకే తృణమూల్ ఓటింగ్‌కు దూరంగా ఉంది.

– రేణుకా చౌదరి, కేంద్ర మాజీ మంత్రి

# మమత ఔట్?

- ఆది నుంచి అనుమానమే
- కాంగ్రెస్‌తో పొసగని స్నేహం
- రైల్వే బడ్జెట్‌పై అవమానం
- బెంగాల్‌పై రాజీలేని ధోరణి
- లోక్‌సభలో కింకర్తవ్యం?



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: మహిళా బిల్లు యూపీయే ప్రభుత్వంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటి దాకా తెరచాటుగా ఉన్న విభేదాలు దీనితో ఒక్కసారిగా బైటపడ్డాయి. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అలిగారు. ఈ బిల్లు గురించి తనతో చర్చించలేదని ఆమెకు కోపమొచ్చింది. దాంతో రాజ్యసభలో ఓటింగు నుంచి ఆ పార్టీ ఎంపీలు గైర్హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీతో మమతకు ఉన్న విభేదాలకు ఇదొక తార్కాణం. రైల్వే బడ్జెట్‌కు కేటాయింపుల విషయంలో ప్రణబ్ ముఖర్జీకి, మమతకు కిందటి నెలలో అభిప్రాయ బేధాలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచే ఆమె కాంగ్రెస్ పార్టీతో తెగతెంపులు చేసుకునే విషయమై తన సన్నిహితులతో చర్చిస్తున్నట్లు తెలిసింది. ఎంతో కీలకమైన మహిళా బిల్లు గురించి ఒక మహిళా నేతగా తనతో సంప్రదించకపోవడం పట్ల ఆమె ఆగ్రహంతో ఉన్నారు. రైల్వే బడ్జెట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ తనను కించపరిచిందని ఆమె భావిస్తున్నారు. అందుకు ప్రతిగా తానూ సంకీర్ణంలో ఒక కీలక భాగస్వామినని చేతల ద్వారా చెప్పాలని ఆమె తీర్మానించుకున్నట్లు ఆమె ప్రత్యర్థి వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. మహిళా బిల్లు దరిమిలా తన స్వరాష్ట్రంలో రాబోయే సమస్యలను తనతో ముందుగా సంప్రదించి ఉంటే బాగుండేదని ఆమె తన సన్నిహితుల వద్ద మొరబెట్టుకున్నారు. ఉద్రేకాలకు, ఆవేశాలకు పెట్టింది పేరైన మమత వెంటనే తన పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలకు గైర్హాజరీ ఆదేశాలిచ్చారు. తద్వారా తనను తక్కువ చేస్తే ఎలాంటి చర్యలకైనా ఉపక్రమించగలనని ఆమె సోనియాకు పరోక్ష సంకేతాలు పంపినట్లయింది. రాజ్యసభలో ఆమె చర్యలు మున్ముందు లోక్‌సభలో ఇదే బిల్లు విషయంలోప్రమాద ఘంటికలుగా మారతాయా అన్నది అందర్నీ అనుమానాల్లో పడేస్తున్నది. మమతా బెనర్జీ మాత్రం లోక్‌సభలో బిల్లు ఓటింగుకు వచ్చినపుపడు ఏమి చేసేదీ చెప్పడం లేదు. పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్ పార్టీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించి ముఖ్యమంత్రిని చేస్తుందా లేదా అనే విషయంలో బోలెడు సందేహాలున్నట్లు తెలిసింది. కేవలం దాని ఆధారంగానే ఆమె లోక్‌సభలో బిల్లుకు అనుకూలంగా ఓటు చేయాలా వద్దా అనేది నిర్ణయిస్తారని అంటున్నారు.

## లోక్ సభలో బిల్లు

# ఎప్పుడు ఎలా?

- రెట్టించిన ఉత్సాహంలో యూపీఏ
- అఖిల పక్షం డిమాండును ఖాతరు చేస్తుందా...
- సభా సమన్వయంపై విమర్శలు



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: రాజ్యసభలోలాగే లోక్ సభలో కూడా మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఉన్న మాట వాస్తవమైనా, రాజ్యసభలో ఆమోదింపజేసుకున్నంత సులభంగా దిగువసభలో బిల్లును ఆమోదింపజేసుకోవడం సాధ్యం కాదనేది పరిశీలకుల భావన. తొలి పరీక్ష నెగ్గిన మహిళా బిల్లు, లోక్‌సభ ఆమోదం కూడా పొందితే ఇక మహిళా రిజర్వేషన్ సాకారమైనట్లే.

అదే సమయంలో రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందడం యూపీఏ సర్కారుకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని, ఎగువ సభలో అయ్యాక లోక్‌సభలో ఆగిపోవడం జరగదని యూపీఏ నేతలు నమ్ముతున్నారని కూడా అంటున్నారు. విత్త బిల్లును, బడ్జెట్‌ను ఆమోదింపజేసుకున్నాకే మహిళా బిల్లును యూపీఏ ప్రభుత్వం లోక్ సభలో ప్రవేశపెడుతుందనే అంచనా ప్రబలంగా ఉంది. లోక్‌సభలో కూడా బిల్లుకు బ్రహ్మాండమైన మెజారిటీ ఉందని జాతీయ మీడియావర్గాలు కూడా బలంగా నమ్ముతున్నాయి.

అయితే లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఎపుడు ప్రవేశపెడతారనేది ఇప్పుడు కీలక అంశంగా మారింది. లోక్ సభలో ప్రవేశపెట్టడానికి గాను బుధ లేక గురువారాలలో జరిగే బీఏసీ సమావేశంలో పార్టీలను స్పీకర్ మీరా కుమార్ సంప్రదించవచ్చని తెలుస్తోంది. తన అంచనా ప్రకారం లోక్ సభ ముందుకు బిల్లు మార్చ 15 లేక 16న రావచ్చని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత నామా నాగేశ్వర రావు తెలిపారు.

లోక్ సభకు బిలు గురువారంనాడే రావచ్చని మేజర్ న్యూస్‌తో మాట్లాడిన రాష్ట్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బిల్లు ఆమోదం పొందడంలో ఏ సమస్యా ఉండదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విత్త బిల్లుకు కూడా బీజేపీ మద్దతు ఇచ్చే పరిస్థితి ఉన్నపుడు మహిళా బిల్లుకు లోక్‌సభలో అడ్డంకి ఉండదని కాంగ్రెస్ ఎంపీలు భావిస్తున్నారు.

**ముందుగా వర్తమానం**

అయితే అన్నింటికన్నా ముందు ఉభయ సభలకు సంబంధించి సభాపరమైన లాంఛనాల పాత్ర కూడా ఉంటుందని టీడీపీ రాజ్యసభ ఎంపీ ఎం.వి.మైసూరారెడ్డి తెలిపారు. బడ్జెట్ సమావేశాలలో భాగంగా ఉభయ సభలు మార్చి 16 నాటికి వాయిదా పడి, విశ్రాంతి తరువాత ఏప్రిల్ 12న తిరిగి ప్రారంభమవుతాయి. విశ్రాంతి లోపలే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని యూపీఏ సర్కారు అనుకుంటే ఈ వర్తమానం తొందరగానే లోక్‌సభకు వెళుతుంది. అయినా ప్రభుత్వం అంత తొందరపడాల్సిన పనిలేదని, విత్త బిల్లు, బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదింపజేసుకున్నాక, ఈ బడ్జెట్ సమావేశాల చివర్లోనే మహిళా బిల్లును లోక్ సభకు తీసుకువస్తారని కొందరు ఎంపీలు అంటున్నారు.

**బడ్జెట్ ప్రక్రియ**

మంగళవారం నాడు గందరగోళం మధ్యే రైల్వే బడ్జెట్‌ను లోక్‌సభ ఆమోదించింది. బుధవారంనుంచి సాధారణ బడ్జెట్‌పై చర్చ ఉంటుంది. ఈ చర్చ శుక్రవారానికి ముగిసి, బడ్జెట్ సభ ఆమోదం కూడా పొందితే, వచ్చే వారంలో సోమ, మంగళవారాలు మిగులుతాయి. ఆ సమయంలోనే బిల్లు లోక్ సభకు రావచ్చని పలువురు ఎంపీల నమ్మకం.

**వేగానికి కళ్లెం..?**

అయితే లోక్‌సభలో బిల్లు పెట్టడానికి యూపీఏ నేతలు అంత తొందర పడకపోవచ్చని, రాజ్యసభలో బిల్లు ఆమోదం దరిమిలా యూపీఏ కూటమి లోపల, వెలుపల మొదలైన లుకలుకలే ఇందుకు కారణమని పరిశీలకులు అంటున్నారు. మొదటగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీని కాంగ్రెస్ నేతలు బుజ్జగించాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది జరిగే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కోనున్న మమతకు మైనారిటీలను సంతృప్తి పరచడం తప్పనిసరైందని అంటున్నారు. మరోవైపు మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్ నేతలు మమత కన్నా వామపక్ష కూటమిపైనే ఎక్కువగా ఆధారపడడం కూడా ఆమెకు రుచించడం లేదు. మమత తీరులోనే రాజ్యసభలో ఓటింగ్‌కు మరో కీలక పార్టీ బీఎస్పీ దూరంగా ఉంది.

యూపీఏకు బీఎస్పి వెలుపలినుంచి ఇస్తున్న మద్దతు ఒకరకంగా కీలకమైనది. యూపీఏ కూటమితో పాటు వెలుపలి పార్టీల మద్దతుతో 295 సీట్ల మెజారిటీ ఉన్న యూపీఏకు.. మాయావతి మద్దతు ఉపసంహరిస్తే.. ఆ సంఖ్య 274కు పడిపోతుంది. అంటే పోటాపోటీ మెజారిటి మిగులుతుంది.

**అఖిల పక్షం తరువాతే లోక్‌సభకు...?**

రాజ్యసభ ఆమోదానికి ముందు యూపీ, బీహార్ యాదవ నేతలు తెరపైకి తెచ్చిన అఖిల పక్ష సమావేశం, బహుశా లోక్‌సభలో బిల్లు ప్రవేశానికి ముందుగా జరగవచ్చని ఒక అంచనా తాజాగా బయలుదేరింది. మంగళవారంనాడు బిల్లు రాజ్యసభ ఆమోదం పొందగానే ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ తాను రాష్ట్రపతి ప్రతిభా పాటిల్‌ను కలవనున్నట్లు చెప్పారు. మద్దతు ఉపసంహరణకే ఆయన కలుస్తారని అనుకున్నా, ఆయన తొందర పడకపోవచ్చు. అదే సమయంలో లాలూ, ములాయం సింగ్‌ల మద్దతుపై తాము ఆధారపడుతున్నట్లు కాంగ్రెస్ ఎప్పుడూ చెప్పుకోలేదు. కనుక ఆయన మద్దతు ఉపసంహరించినా భయపడేది లేతదన్న ధోరణి కూడా కాంగ్రెస్‌లో వ్యక్తమవుతోంది.

మహిళా బిల్లుకు, అలాగే విత్తబిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితి ఉందని కాంగ్రెస్ నమ్ముతోంది. అంత మాత్రాన సమస్యలు అంతమైనట్లు కాదు. లోక్‌సభలో బిల్లు ప్రవేశపెడితే రాజ్యసభలో కన్నా ఎక్కువగా రభస జరిగే అవకాశాలు ఉన్నాయి.

అందులోనూ రాజ్యసభలో సోమ, మంగళవారాలలో తలెత్తిన అవాంఛనీయ ఘటనలకు కారణం యూపీఏ నేతలేనని, వారు అనుకూల, వ్యతిరేక పార్టీల మధ్య సమన్వయాన్ని సాధించలేదని విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. కనుక ఈసారి మళ్లీ అదే రిస్కు తీసుకోరనే వాదన ఉంది.

**అఖిలపక్షం అవసరమా...!**

కాగా, మొట్టమొదటగా రాజ్యసభలో ప్రవేశపెట్టి ఓటింగ్‌కు వెళ్లినపుడు లేని సమస్య, మలి విడతగా లోక్‌సభలో బిల్లు పెట్టినపుడు రాదని కాంగ్రెస్‌లోనే పలువురు నమ్ముతున్నట్లు తెలుస్తోంది. కనుక, రాజ్యసభకు జరిగిన కసరత్తులాంటిదే మరోసారి నిర్వహిస్తారని అనుకోవచ్చు.

మంగళవారం ఉదయం జరిగిన పరిణామాలనే తీసుకుంటే... యాదవ త్రయంతో ప్రధాని మన్మోహన్ పసింగ్ భేటీ అయ్యారు. బిజెపి, వామపక్ష నేతలతో ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ భేటీ అయ్యారు. దీంతో

ఇక అఖిల పక్షానికి తావే లేకుండా పోయింది. మరోవైపు, బిల్లు ఎట్టిపరిస్థితులలోనూ ఆమోదం పొందాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధి భావించడం, యుపిఎ సభా సమన్వయ కర్తలపై బలంగా పనిచేసిందని అంటున్నారు. ఈ తరహా కారణాలన్నింటివల్లా లోక్ సబలో కూడా బిలుల ఆమోదం సునాయాసంగా జరిగిపోతుందని రాజకీయ వర్గాలు నమ్ముతున్నాయి.

## మహిళా కాంగ్రెస్ సంబరాలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: పార్లమెంటు ఉభయ సభలలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంతో మంగళవారం సాయంత్రం గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సంబరాలు నిర్వహించింది. గాంధీభవన్ ఆవరణలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ గంగాభవానీ, నాయకురాలు రజినీదేవీ, షమీయ్ ఆగా, రజిని, శ్రీమని, సునీత తదితరులు టపాసులు పేల్చుతూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ హయాంలోనూ మహిళలకు పెద్దపీట అని వారు నినాదించారు.

**పీసీసీ హర్షం**



పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం పట్ల పీసీసీ హర్షం ప్రకటించింది. ఈ మేరకు పీసీసీ అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి మంగళవారం నాడొక ప్రకటన విడుదల చేశారు. ఈ బిల్లు ఆమోదం చారిత్రాత్మకమైనదని పేర్కొన్నారు

### మద్దతు కూడగట్టాం



చర్చలేకుండానే బిల్లు ఆమోదం పొందాలని ప్రభుత్వం ప్రభుత్వం కోరుకుంది. చర్చ లేకుండా ఆమోదించి బిల్లుకు తూట్లు పొడవద్దని ప్రధానికి, రాజ్యభసభ ఛైర్మన్‌కూ చెప్పాం. యూపీఏలో మిత్రపక్షాలే తలా ఓ మాట మాట్లాడుతున్నప్పుడు, రాజ్యసభలో మైనారిటీలో ఉన్న ప్రభుత్వానికి బిల్లు ఆమోదం పొందుతుందని ప్రతిపక్షం మాటిచ్చింది. అందుకోసం మద్దతు కూడగట్టాం. బిల్లు ఆమోదానికి చొరవ చూపినందుకు బీజేపీ గర్విస్తోంది.

–రాజ్యసభలో ప్రతిపక్ష నేత అరుణ్‌జైట్లీ



రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందడం ఆనందదాయకం.ఇది భారతీయ మహిళా సాధికారిక దిశలో మరో ముందడుగు.లోక్‌సభలోనూ బీజేపీ సంపూర్ణ మద్ద తును ఇస్తుం ది.సాధ్యమైనంత త్వరగా లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టాలని కోరుకుంటున్నాం.

–లోక్‌సభలో బీజేపీ పక్షనేత సుష్మా స్వరాజ్

### ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించే వరకూ పోరాడతాం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: మహిళా రిజర్వేషన్లను ఆమోదిస్తూనే ఓబిసీలకు రిజర్వేషన్లు కల్పించాలని టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కేంద్రప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తెలుగు దేశంపార్టీకి వెనుకబడిన వర్గాలు వెన్నెముక వంటివన్న చంద్రబాబు ఓబిసీలకు రిజర్వేషన్లు కల్పించే వరకూ పోరాడతామన్నారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో పీఆర్పీ నేత, మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ తెలుగుదేశం పార్టీలో చేరారు. వివిధ కారణాలతో పార్టీ వీడిన వారంతా తిరిగి సొంత గూటికి చేరాలని బాబు పిలుపు నిచ్చారు. ప్రజా సమస్యలపై ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోనని ఆయన స్పష్టం చేశారు.

## స్పందనలు

### మైనారిటీలకు వ్యతిరేకం కాదు



మైనారిటీలకు కానీ ఎస్సీ, ఎస్టీలకు కానీ ఈ బిల్లు వ్యతిరేకం కాదు. స్త్రీలకు దాస్య విముక్తి కల్పించడమే మహిళా రిజర్వేషన్ బిల్లు ఉద్దేశం. ఇది చరిత్రాత్మక ఘట్టం. మహత్తరమైన తరుణం. – మన్మోహన్‌సింగ్, ప్రధానమంత్రి

### విభేదాలు స్పష్టమవుతున్నాయి



కాంగ్రెస్‌కు, తృణమూల్ కాంగ్రెస్‌కు మధ్య విభేదాలు నానాటికీ మరింత స్పష్టంగా తెలుస్తున్నాయి.బిల్లును పార్లమెంటులో ఉంచేందుకు కేంద్ర మంత్రిమండలి క్లియరెన్స్ ఇచ్చినప్పుడు, తనను సంప్రదించలేదనడం విచిత్రంగా ఉంది. మహిళలకు రిజర్వేషన్లతో తనకేమాత్రం సంబంధం లేనట్టు ఆమె వ్యవహరించారు.

– సీతారాం ఏచూరి, సీపీఎం నాయకుడు

### ఒక అడుగు వేశాం



మహిళాబిల్లుపై మనం ఒక అడుగు ముందుకు వేశాం. లోక్‌సభలో కూడా బిల్లు ఆమోదం పొందాలని కోరుకుంటున్నాను. ఇది చరిత్రాత్మక సంఘటన.

– జయప్రద, బహిష్కృత సమాజ్‌వాది ఎంపీ

### మైలురాయి



బిల్లు రాజ్యసభ ఆమోదం పొందడం ఓ మైలురాయి. ప్రజాస్వామ్య శక్తులకు ఇది మరింత బలాన్నిస్తుంది.

– రీటా బహుగుణ, యూపీసీసీ అధ్యక్షురాలు

### ఇది ప్రజాస్వామ్య విజయం

బిల్లు ఆమోదం పొందడం బీజేపీ విజయమో, కాంగ్రెస్ విజయమో కాదు. ఇది ప్రజాస్వామ్య విజయం. అయితే బీజేపీ, వామపక్షాల స్పష్టమైన మద్దతు లేకుంటే కాంగ్రెస్‌కు మెజారిటీ లభించేది కాదు. ఈరోజు కాంగ్రెస్ చర్చల్లో కాలయాపన చేస్తూ వ్యవహరించింది. ఓటింగ్ ప్రక్రియలో కూడా అదే కనిపించింది.దీనిపై నేను ఛైర్మన్‌కు చెప్పాను. చర్చకు అవకాశం ఇవ్వాలని అరుణ్‌జైట్లీ ప్రధానిని కలిసి చెప్పారు. కాంగ్రెస్ నిర్వహణతీరు చాలా బలహీనంగా ఉంది. ఇక వారు లోక్‌సభలో నెగ్గుకు రావాలి. మమతనూ బుజ్జగించాలి.

– రవిశంకర్ ప్రసాద్, బీజేపీ నాయకుడు

### దేశ చరిత్రలో ప్రత్యేకంగా లిఖించదగిన రోజు



"భారతీయ మహిళాలోకం దేశ చరిత్రలో ఈ రోజు లిఖించదగిన అధ్యాయనం. మహిళా బిల్లుకు రాజ్య సభ్యులు 189 మంది మద్దతుతో ఆమోదించడం చరిత్రాత్మక విజయం. ఈ బిల్లు ఆమోదం ద్వారా మహిళలకు రాజ్య సభలో 33 శాతానికిపైగా రిజర్వేషన్లు లభిస్తాయి. ఈ బిల్లుకు యూపీఏలోని కొన్ని పక్షాలు కొంత మనస్తాపం చెందినప్పటికీ... యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ సదరు నేతలతో చర్చించి ఒప్పించారు. దీనిలో ప్రధాని మన్మోహన్‌సింగ్ కృషి మాటల్లో చెప్పలేను. మహిళా బిల్లు అమోదం కోసం కృషి చేసిన వీరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ చేస్తున్నాను.

– ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య

### కొన్ని సంవత్సరాల నిరీక్షణ ఫలించింది

"మహిళా దినోత్సవానికి ఒక్క రోజు ఆలస్యంగా మహిళా బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించింది. ఈ బిల్లు ఆమోదం కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూశాం. ఈ రోజు మహిళలకు స్వర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. చాలా సంతోషంగా ఉంది. బిల్లు ఆమోదానికి వ్యతిరేకత వచ్చినప్పటికీ... యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ పట్టుబట్టి మరీ బిల్లు ఆమోదానికి కృషి చేశారు.

అప్పట్లో రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అందిస్తే.. ఇప్పుడు సోనియాగాంధీ చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభించే విధంగా కృషి చేశారు.

– రాష్ట్ర సమాచార, టూరిజం శాఖ మంత్రి గీతారెడ్డి

### 14 సంవత్సరాలుగాఎదురుచూశాం



" 14 సంవత్సరాలుగా మహిళ బిల్లు ఆమోదం కోసం ఎదురుచూశాం. యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ కృషితో మార్చి9న ఇది నెరవేరింది. దేశ మహిళలకు ఇది స్వర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు. దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరుగురు మహిళలకు తన మంత్రివర్గంలో అవకాశం ఇచ్చారు. ముఖ్యమంత్రి రోశయ్య ఒక మహిళను లీడర్ ఆఫ్ ది హౌస్‌గా చేసి..తన ప్రత్యేకతను నిలుపుకున్నారు.

–మంత్రి డి.కె అరుణ

### రాజకీయ రిజర్వేషన్లలో మరోసారి మోసం

అగ్రవర్ణ అహంకారాన్ని పుణికిపుచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీసీలకు మహిళా బిల్లులో రిజర్వేషన్లు కల్పించకుండా మోసం చేసింది. 1950లో వెనుకబడిన తరగతుల్లోని ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లను కల్పించిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా అగ్రవర్ణ పాలనను గత 60 ఏళ్లుగా సుస్థిరం చేసుకుంది.

– బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు రామకృష్ణయ్య

### బీసీలు మిలిటెంట్‌లుగా మారకపోతే భవిష్యత్ లేదు



బీసీలు మిలిటెంట్‌లుగా మారి పోరాడకపోతే ఈ దేశంలో భవిష్యత్తు లేదు. జనాభాలో 52 శాతం ఉన్న బీసీ మహిళలకు మహిళా బిల్లులో వాటా దక్కకుండా చేసి యూపీఏ ప్రభుత్వం చారిత్రక తప్పిదానికి పాల్పడింది. మహిళా బిల్లుకు ఎవరూ వ్యతిరేకం కాదు. బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు జనాభా ప్రకారం ఇవ్వాలనేదే తమ పోరాటం ప్రధాన ఉద్దేశం.

మహిళలకు చట్టసభలలో పది శాతం మాత్రమే ప్రాతినిధ్యం ఉంది. మహిళా బిల్లు పేరుమీద కేంద్ర ప్రభుత్వం దేశంలోని మహిళలను మభ్య పెడుతోంది.

– ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

### మూడో వంతు సీట్లివ్వాలి



మహిళా రిజర్వేషన్లలో మూడవ వంతు సీట్లను బలహీన వర్గాల మహిళలకు కేటాయించాలి. మహిళల రాజకీయ ఎదుగుదలను తెలుగుదేశంపార్టీ మొదటి నుంచీ ప్రొత్సహి స్తోంది.

రాజకీయాల్లో బలహీన వర్గాలను ప్రోత్సహించడం ద్వారా సమాజంలోని అంతరాలను తొలగించడానికి మా పార్టీ ప్రయత్నించింది. జాతీయపార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు మాత్రం బలహీనవర్గాలను పావులుగా వాడుకుంటున్నాయి.

– టీడీపీ సీనియర్‌నేత యనమల రామకృష్ణుడు